# సజావుగా పది పరీక్షలు

- రంగారెడ్డి జిల్లాలో 51,096మంది విద్యార్థులు హాజరు.. 508 మంది గైర్హాజర్
- కిటకిటలాడిన పరీక్షా కేంద్రాలు
- కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, మార్చి 21 (నమస్తేతెలంగాణ) : పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. పరీక్షలు సజావుగా సాగాయి. పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో 249 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో 51,794మంది పరీక్ష రాయాల్సి ఉండగా 51,096మంది హాజరయ్యారు. 508మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 9.30గంటలకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో హాజరయ్యారు. కేంద్రాల వద్దకు తల్లిదండ్రులు విద్యార్థులను తీసుకొచ్చి వారిని ఆయా కేంద్రాల్లోకి పంపారు. దీంతో పరీక్షా కేంద్రాలు విద్యార్థినీవిద్యార్థులు వారి తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉండడంతో పోలీసులు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లను పూర్తిగా మూసివేయించారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. కేంద్రాలకు వచ్చే విద్యార్థులను మెయిన్‌గేట్ల వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు తదితర అన్ని మౌలిక వసతులను కల్పించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ సెంటర్లల్లో విద్యార్థుల వసతులపై కలెక్టర్ నారాయణరెడ్డి శుక్రవారం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



వికారాబాద్ : పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

## పకడ్బందీగా పరీక్షలు

**వికారాబాద్ :** పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. వికారాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షల కోసం 69 కేంద్రాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలోని జడ్పీ హెచ్‌ఎస్, బాలురు, బాలికలు, సేయింట్ ఆంథోని హైస్కూల్, సంఘం లక్ష్మీబాయి బాలికల పాఠశాలలో ఏర్పాటు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్, విద్యుత్, వైద్య తదితర సదుపాయాల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదన్నారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షలు సజావుగా సాగేందుకు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆయా కేంద్రాల ఇన్‌చార్జిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



వికారాబాద్ : పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

## కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

వికారాబాద్, మార్చి 21 : పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. వికారాబాద్ పట్టణంలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఎస్పీ సందర్శించి బందోబస్తును పరిశీలించారు. విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందితో మాట్లాడి భద్రతా ఏర్పాట్లపై సూచనలు ఇచ్చారు. ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కేంద్రాల చుట్టుపక్కల అనవసరంగా తిరుగుతున్న అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టాలని సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్పీ తెలిపారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, పరీక్షా కేంద్రాల సిబ్బంది ఎవరికైనా ఏదైనా సాయం అవసరమైతే సంబంధిత పోలీస్ స్టేషన్, కంట్రోల్ రూమ్, డయల్ 100ను సంప్రదించాలని ఆయన సూచించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తి స్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉందని వివరించారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



శంకర్‌పల్లి మోడల్ స్కూల్‌లో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



శంకర్‌పల్లి బాలుర హైస్కూల్‌లో..

# వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న అదనపు కలెక్టర్ సుధీర్ తదితరులు

వికారాబాద్, మార్చి 21 : జిల్లాలోని అన్ని వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయం నుంచి వసతి గృహాల వార్డెన్‌లతో జూమ్ సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఎస్సీ, బీసీ, గిరిజన సంక్షేమ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి వాతావరణంలో చదుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. వసతి గృహాలకు ఇప్పటివరకు మంజూరు చేసిన నిధులతో మరమ్మతులు పూర్తి చేశామన్నారు. పనులకు సంబంధించి ప్రతి వసతి గృహంలో రూఫ్ లీకేజీ, టాయిలెట్స్, రన్నింగ్ వాటర్, కిటికీలు, తలుపులు, తాగునీటికి ఆర్‌వో ప్లాంట్స్ తదితర సదుపాయాల ఏర్పాట్లపై మండలాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. అన్ని వసతి గృహాలకు పెయింటింగ్ పూర్తి చేశారా? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? వసతి గృహాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. ఏ హాస్టల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? ఎన్ని రూమ్‌లు ఉన్నాయి? ఏ యే పనులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలు తెలుసుకున్నారు. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. జూమ్ మీటింగ్‌లో బీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి మల్లేశం, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉపేందర్, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్ రెడ్డి, ఎస్సీ, బీసీ, గిరిజన వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

# 31లోపు ఎల్ ఆర్ఎస్ ఫీజు చెల్లించాలి



వికారాబాద్ :వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అధికారులు

వికారాబాద్, మార్చి 21 : ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ దానం కిశోర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆమోదించిన వాటికి ఈ నెల 31 వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుంలో 25 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్బన్, రూరల్, గ్రామ పంచాయతీల్లో ఈ వివరాలపై అవగాహన కల్పించాలన్నారు. వికారాబాద్ వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ సుధీర్ పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 36,995 వచ్చాయని, 1130 ఫ్రీ పెయి డ్ చేశామన్నారు. మిగతా వాటిని ఈ నెల 31వరకు పూర్తి చేస్తామన్నారు. వీసీలో డీసీవో జయసుధ, మున్సిపల్ కమిషనర్లు జాకీర్ అహ్మద్, విక్రం సింహారెడ్డి, వెంకటయ్య, వేణుగోపాల్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలి

- రంగారెడ్డి డీపీవో సురేశ్ మోహన్
- సంగెం గ్రామం ఆకస్మిక తనిఖీ



సంగెం గ్రామ పంచాయతీలో మాట్లాడుతున్న డీపీవో సురేశ్‌మోహన్

కేశంపేట, మార్చి 21 : గ్రామాల్లో పూర్తిస్థాయిలో ఇంటి పన్నుతోపాటు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు ఫీజు చెల్లించేలా కార్యదర్శులు కృషి చేయాలని రంగారెడ్డి డీపీవో సురేశ్ మోహన్ అన్నారు. కేశంపేట మండల పరిషత్ ఆవరణలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీపీవో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్లు చేసి ఫీజు చెల్లించేలా చూడాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు గడువు పూర్తయ్యే సమయం దగ్గరలోనే ఉందని, ఫీజు చెల్లిస్తే లభించే 25శాతం రాయితీని వివరించి చైతన్య పరచాలన్నారు. ఆయా గ్రామాల్లో ఇంటి పన్నుల చెల్లింపుల విషయంలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి 100శాతం టార్గెట్‌ను పూర్తి చేయాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరించేలా పంచాయతీ కార్మికులకు సూచించాలన్నారు. అంతకు ముందు మండల పరిధిలోని సంగెం గ్రామాన్ని డీపీవో ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామంలోని రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల దుకాణాల వద్దకు వెళ్లి మాట్లాడారు. దుకాణదారులు వ్యర్థాలను ఆరుబయట వేయవద్దని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీకి వెళ్లి ఇంటి పన్ను చెల్లింపులకు సంబంధించిన వివరాలను కార్యదర్శి సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు. నిరుపయోగంగా ఉన్న నీటి ట్యాంక్ మరమ్మతులను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో మల్లారెడ్డి, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో పెంపొందనున్న సాంకేతిక నైపుణ్యాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇక్ఫాయ్ ఉపకులపతి డాక్టర్ ఎల్ ఎస్ గణేశ్

చేవెళ్ల రూరల్, మార్చి 21 : సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో సాంకేతిక విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందుతాయని ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎల్‌ఎస్ గణేశ్ అన్నారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని దొంతాన్‌పల్లిలో ఉన్న ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం (ఐబీఎస్) ప్రాంగణంలో డిగ్రీ విద్యనభ్యస్తున్న విద్యార్థుల ఆధ్వర్యంలో త్రితి - 2025 అనే మూడు రోజుల వార్షిక, సాంకేతిక -సాంస్కృతిక ఉత్సవం ఈ నెల 20న ప్రారంభమైంది. ఈ కార్యక్రమం రెండో రో జూ శుక్రవారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి ఇక్ఫాయ్ ఉపకులపతి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడు తూ.. విద్యతో పాటు క్రీడా సాంఘిక, సాం స్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని, అవి విద్యార్థుల మానసిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. అనంతరం ఇక్ఫాయ్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాల్లో వి ద్యార్థులు అందరూ కలిసికట్టుగా ఎలాంటి భి న్నాభిప్రాయాలు లేకుండా ఉత్సాహంగా పా లు పంచుకోవడం శుభ పరిణామమన్నారు. పాటలు, నృత్యాలు, సామూహిక నృత్య ప్రదర్శనలు, ర్యాంప్ వాక్ పాటలు ఆర్ట్ ఎక్స్‌పో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్ఫాయ్ బిజినెస్ స్కూల్, ఇక్ఫాయ్ టెక్ స్కూల్, ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, ఇక్ఫాయ్ లా స్కూల్, ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఐదు స్కూళ్లకు చెందిన డెరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



మంచాల : చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మత్స్యకారులను అరెస్టుచేసిన పోలీసులు




కొత్తూరు : మత్స్యకారులను అరెస్ట్ చేసిన కొత్తూరు పోలీసులు

మంచాల, మార్చి 21 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ అభివృద్ధికి నిధులు కేటాయించడంలో మొండిచేయి చూపించిందని మత్స్య కార్మిక సంఘం నాయకులు అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ పిలుపు మేరకు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న మంచాల మండల మత్స్య కార్మిక సంఘం నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సిగ్గు చేటని అన్నారు. 2025-26 సంవత్సరంలోని బడ్జెట్‌లో మత్స్య శాఖకు మొండిచేయి చూపించిందని, ముదిరాజ్‌లను బీసీ డీ నుండి బీసీ ఏ లోకి మారుస్తామని చెప్పి మాట తప్పారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్య శాఖకు వందకోట్ల రూపాయలను కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం సిగ్గు చేటన్నారు. మత్స్య శాఖకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించడంతో పాటు మంత్రిని కూడా నియమించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మత్స్య శాఖ నాయకులు జిలమోని సత్తయ్య, చిందకింది చక్రపాణి, నీళ్ల కృష్ణ, తవిటి యాదగిరి, జిలమోని మల్లేశ్, చింతకింది జంగయ్య తదితరులు ఉన్నారు.

### మత్స్యశాఖకు నిధులు కేటాయించాలి

**కొత్తూరు :** రాష్ట్ర బడ్జెట్‌లో మత్స్యశాఖకు నిధులు కేటాయించకపోవడంతో శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ముట్టడికి బయలు దేరిన కొత్తూరు మండల మత్స్యకార నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కొత్తూరు మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మాసుల రామకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ.. మత్స్యశాఖకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం గూడూరు మత్స్య సహకారం సంఘం అధ్యక్షుడు సురేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. మత్స్యకారులకు నిధులు కేటాయించే వరకు పోరాటం ఆగదన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ డోలి రవీందర్, గడ్డం రమేజవ్ గౌడుగు రవి తదితరులు ఉన్నారు.

# అసంపూర్తిగా రైతులకు రుణమాఫీ



రుణమాఫీ కాలేదని పోస్టు కార్డులతో తెలియజేసేందుకు సీఎం కార్యాలయానికి వెళ్తున్న పులుమామిడి గ్రామ రైతులు

నవాబుపేట, మార్చి 21 : కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నట్లు రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని బీఆర్‌ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు అంతమోళ్ల దయాకర్ రెడ్డి అన్నారు. ఈ విషయమై ఏ చర్చకైనా సిద్ధమని బీఆర్‌ఎస్ నవాబుపేట మండల అధ్యక్షుడు అంతమోళ్ల దయాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని పులుమామిడి గ్రామంలో రుణమాఫీ కాని రైతుల బాధలను అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్యపడకుండా ముందుకెళ్లాలన్నారు. మాటతప్పి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగ్గిన మూల్యం చెల్లించాలన్నారు. మండల పరిధిలో రుణమాఫీ కానీ రైతుల వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. వారి బాధలను పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా సీఎంకు తెలియజేస్తామన్నారు. కార్యక్రమం లో రైతు సంఘం అధ్యక్షుడు జగన్‌రెడ్డి, రైతు సంఘం జనరల్ సెక్రటరీ బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పోలీస్ మహేశ్వర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు శాంతి కుమార్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ బసిరెడ్డి గారి విష్ణువర్ధన్‌రెడ్డి, మండల ప్రచార కార్యదర్శి ఆసిరెడ్డి గారి వెంకట్‌రెడ్డి, దాన అనిల్ కుమార్, మైనార్టీ నాయకులు ఇమ్రన్‌ఖాన్, పులుమామిడి అధ్యక్షుడు కురవ రాఘవేందర్, యోత్రాజ్‌పల్లి గ్రామ అధ్యక్షుడు ముకుంద్ రెడ్డి, రైతులు రూశనంపల్లి పర్మారెడ్డి, రాంచంద్రి చౌకత్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల భూషణం, ఎం.డీ గౌడస్ ధర్మారెడ్డి ఉన్నారు.

# కట్టుకున్నోడే కడతేర్చాడు

షాద్‌నగర్, మార్చి 21 : తాగుడుకు బానిసై కట్టుకున్న భార్యను అతి కిరాతంగా ఓ భర్త గొడ్డలితో నరికి చంపిన ఘటన ఫరూఖ్‌నగర్ మండలం అయ్యావారిపల్లిలో శుక్రవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం పరశురాములు, అతని భార్య జమున (38) గ్రామంలో నివాసం ఉంటూ ఉపాధి పొందుతుండేవారు. పరశురాములు గత కొన్నాళ్లుగా మద్యానికి బానిసై తరచూ భార్యను వేధిస్తుండేవాడు. ఇందులో భాగంగానే గురువారం రాత్రి డబ్బుల విషయమై ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఇంతలోనే భార్యపై మరింత కోపాన్ని పెంచుకున్న పరుశరాములు సమీపంలో ఉన్న గొడ్డలితో భార్య మెడపై మోదడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని హత్యకు కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

# విమానశ్రయానికి క్యాబ్‌లు బంద్

సిటీబ్యూరో, మార్చి 21 ( నమస్తే తెలంగాణ) :13 రోజులుగా నగరవ్యాప్తంగా క్యాబ్ డ్రైవర్లు విమానాశ్రయానికి ట్రిప్పులు నిలిపివేయడంతో దేశ, విదేశాల ప్రయాణికులు ఇక్కట్ల పాలవుతున్నారు. విమానాశ్రయం వద్ద క్యాబ్ సర్వీసులు అందుబాటులో ఉండకపోవడంతో వాళ్లంతా వాహనాల కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో ప్రయాణికులకు క్యాబ్ సర్వీసులు అందుబాటులో లేవని.. డ్రైవర్లు నిరసన చేపట్టారని తెలియజేస్తూ ప్రత్యామ్నాయాలు చూసుకోవాలంటూ విమానాశ్రయ సిబ్బంది సూచిస్తున్నది. కాగా, రైడ్ ధరలు పెంచాలని 13 రోజులుగా నిరసనలు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని తెలంగాణ క్యాబ్ అసోసియేషన్, గిగ్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ సలావుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# ఆశలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



యాలాల ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ కార్యకర్తలు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

యాలాల, మార్చి 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రం ఎదుట ప్రభుత్వ మొండి వైఖరిపై ఆశ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ నేతలు ఎన్నికల ఇచ్చిన హామీ ప్రకారం కనీస వేతనం రూ.18 వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. 2024 ఫిబ్రవరి 9, జులై 30, డిసెంబర్ 10న ఆరోగ్య శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన ఆశ కార్మికులకు రూ.50 లక్షల బీమా, అంత్యక్రియల ఖర్చులకు రూ.50 వేలు అందించడంతో పాటు ఉద్యోగ విరమణ లాభాలు, సెలవులను ఇస్తామని నాటి కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. ఆ హామీలు ఇప్పుడు ఏమయ్యాయన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజమ్మ, సులోచన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.